ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 15 జూలై 2024



విశాఖ భూ దందాపై ప్రభుత్వం ఫోకస్!

నేడు అమరావతిలో శ్వేతపత్రం విడుదల

- ఉమ్మడి జిల్లాలో సాగిన వ్యవహారాలపై ఆరా
- ఎయిర్‌పోర్టులో నిర్వహించిన సమీక్షలో వివరాలు తెలుసుకున్న సీఎం
- అడ్డగోలు దోపిడీపై ముఖ్యమంత్రికి నివేదించిన టీడీపీ నేతలు
- విశాఖ ఫైల్స్ పేరుతో నివేదిక సిద్ధం చేస్తున్నామన్న ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి):

విశాఖ కేంద్రంగా గత ప్రభుత్వ పాలకులు, వైసీపీ అనుచరులు సాగించిన భూ దందాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు భిన్నంగా విశాఖలో వేల కోట్ల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు దోపిడీకి గురయ్యాయని కొత్త ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ దందాలు, గనుల దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయనున్నారు. ఇందులో ప్రధానంగా విశాఖలో భూదోపిడీపై పలు అంశాలను ప్రత్యేకంగా ప్రస్తావించనున్నారని సమాచారం.



విశాఖలోని దసపల్లా హిల్స్ స్థలాలు



కశింకోట మండలం విస్సన్నపేట వద్ద కొనుగోలు చేసిన భూముల్లో ఒక కొండను చదును చేస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

విస్సన్నపేట భూ దందాపై నివేదిక

అనకాపల్లి జిల్లా కశింకోట మండలం విస్సన్నపేటలో సుమారు 600 ఎకరాల భూ దందాపై ఇప్పటికే జిల్లా టీడీపీ నేతలు ముఖ్యమంత్రికి నివేదించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో కొందరు అనుచరులు విస్సన్నపేట భూములు చేజిక్కించుకున్నారన్నది ప్రధాన అభియోగం. ఈ భూముల్లో కొంతవరకు ప్రభుత్వ, అసైన్డ్, మిగులు భూములతోపాటు గెడ్డలు, వాగులు, రహదారులు ఉన్నాయి. దీనికితోడు విస్సన్నపేటలో భారీగా వనరుల విధ్వంసం జరిగింది. కాగా అనకాపల్లిలోని నాతవరం మండలం భమిడికలొద్దిలో లక్షల క్యూబిక్ మీటర్ల లేటరైట్ తవ్వేశారు. అటవీ భూములు స్వాధీనం చేసుకుని చెట్లు కొట్టేసి, రోడ్లు వేసి లోపలకు ఎవరినీ అనుమతించకుండా ఒక మాఫియాను నడిపించారు. భమిడికలొద్దిలో తవ్వింది బాక్సైట్ గనులే అయినా లేటరైట్ పేరుతో తవ్వుకుని సొమ్ము చేసుకున్నారు. ఇక అనకాపల్లి మండలంలో మెటల్ క్వారీలను లీజుదారుల నుంచి బలవంతంగా స్వాధీనం చేసుకుని వేల క్యూబిక్ మీటర్లు తవ్వేశారు. ఈ భూ దందాలు, గనుల దోపిడీకి సంబంధించి వివరాలను అనకాపల్లి జిల్లా పార్టీ నాయకులు ముఖ్యమంత్రికి నివేదించారు.

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను కబ్జా చేయడం, బలవంతంగా లాక్కోవడం లాంటి అనేక దారుణ సంఘటనలు చోటుచేసుకున్నాయి. వాటన్నింటి వివరాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో సేకరించింది. విశాఖకు చెందిన తెలుగుదేశం నేతలు, జిల్లా యంత్రాంగం నుంచి వేర్వేరుగా సమాచారం తీసుకున్నట్టు తెలిసింది. విశాఖలో భూ కబ్జాలపై గతంలో పనిచేసిన ఒక ఐఏఎస్ అధికారి నుంచి కూడా వివరాలతో నివేదిక కూడా తీసుకున్నారని సమాచారం. కొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ మరో నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. ఇంకా తెలుగుదేశం నుంచి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నివేదిక అందజేశారు. భూ కబ్జాలపై విశాఖ నుంచి సమగ్ర వివరాలు సేకరించడంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కీలకభూమి పోషించారని సమాచారం. నాలుగు రోజుల క్రితం జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు విశాఖలో భూ కబ్జాలపై చర్యలు తీసుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ... మిగతా 8వ పేజీలో



రాజరాజేశ్వరికి గాజుల అలంకరణ

మండలంలోని దేవీపురంలో గల రాజరాజేశ్వరి సహస్రాక్షి అమ్మవారి ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వాగీశ్వరి సహిత వారాహి హోమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి అమ్మవారిని గాజులతో విశేషంగా అలంకరించారు. అనంతరం అర్చనలు, వారాహి సిరిజ్యోతి పూజ నిర్వహించారు.

- సబ్బవరం

నక్కపల్లి ఆస్పత్రిలో రోగులకు భోజనం

- హోం మంత్రి అనిత ఆదేశాలతో పునరుద్ధరణ



రోగులకు భోజనం అందజేస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నక్కపల్లి, జూలై 14: నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో రోగులకు భోజన సరఫరాను ఆదివారం పునఃప్రారంభించారు. ఈ నెల 13న 'ఆంధ్రజ్యోతి'లో 'నక్కపల్లి ఆస్పత్రిలో భోజనం బంద్' శీర్షికన ప్రచురితమైన కథనానికి హోం మంత్రి అనిత స్పందించారు. తక్షణమే నిలిచిపోయిన భోజన సదుపాయాన్ని పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. త్వరలో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించేలా చూడాలని ఫోన్ ద్వారా హోం మంత్రి అధికారులను ఆదేశించారు. దీంతో వైద్య, ఆరోగ్యశాఖాధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. ఫలితంగా ఏప్రిల్ నెల నుంచి నిలిచిపోయిన మధ్యాహ్న భోజనం సరఫరాను ఆదివారం నుంచి పునరుద్ధరించారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, వైద్య సిబ్బంది రోగులకు ఆదివారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని అందజేశారు. దీనిపై రోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష, వైద్యాధికారులు డాక్టర్ ఈశ్వరప్రసాద్, అనూష, సిబ్బంది స్వాతి, సుమ, శ్రీదేవి, టీడీపీ నాయకుడు కక్కిరాల సురేశ్ పాల్గొన్నారు.

రాంకీ ఉపాధి హామీ హుళక్కేనా?

500 మంది మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిన రాంకీ యాజమాన్యం

- 12 ఏళ్లు గడుస్తున్నా నెరవేర్చని వైనం
- ఆందోళనకు సిద్ధమవుతున్న మత్స్యకారులు


పరవాడ, జూలై 14:

ముత్యాలమ్మపాలెం పంచాయతీ మత్స్యకారులకు ఫార్మాసిటీలో ఉపాధి ఎండమావిగానే మిగిలిపోయింది. 500 మంది మత్స్యకారులకు దఫదఫాలుగా ఉపాధి కల్పిస్తామని రాంకీ యాజమాన్యం 12 ఏళ్ల క్రితం లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చింది. అయితే ఇప్పటికీ ఆ హామీని నెరవేర్చలేకపోయింది. దీంతో మత్స్యకారులు ఫార్మాసిటీలోని రాంకీ కమర్షియల్ హబ్ ఎదుట ఆందోళన చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.



తాడి తరలింపుతో పాటు ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ 2012వ సంవత్సరంలో ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న బండారు, మాదంశెట్టి నీలబాబు (ఫైల్ ఫొటో)

ఫార్మాసిటీ కాలుష్యం కారణంగా సమీపంలో ఉన్న తాడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఫార్మాసిటీ నుంచి వెదజల్లే రసాయనాల కారణంగా దుర్వాసన వెదజల్లేది. దీంతో తాడి గ్రామస్థులు గ్రామాన్ని తరలించాలని ఆందోళనలు చేపట్టేవారు. అలాగే ఫార్మాసిటీలో పరిశ్రమల వ్యర్థాలను రాంకీ యాజమాన్యం సీఈటీపీలో శుద్ధి చేసి అనంతరం పైపులైన్ ద్వారా తిక్కవానిపాలెం సముద్ర తీరంలో విడిచిపెట్టాలి. అయితే రాంకీ యాజమాన్యం ఫార్మా వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండానే నేరుగా సముద్రంలోకి విడిచిపెట్టేది. దీని కారణంగా ముత్యాలమ్మపాలెం తీరంలో భారీ ఎత్తున చేపలు మృత్యువాత పడేవి. దీంతో మత్స్యకారుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారింది. పరవాడ మండలంలో తాడి తరలింపుతో పాటు మత్స్యకారులకు ఉపాధి కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌లతో 2012లో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, అప్పటి ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, అప్పటి ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల ముత్యాలు తదితరులు రాంకీ గేటు వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఈ దీక్షలకు మండలంతో పాటు జిల్లా నలుమూలల నుంచి ప్రజల మద్దతు లభించింది. మూడు రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష అనంతరం ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఎట్టకేలకు రాంకీ యాజమాన్యం దిగొచ్చింది. తాడి గ్రామాన్ని తరలించడంతో పాటు ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు 500 మందికి దఫ దఫాలుగా ఫార్మాసిటీలో ఉపాధి కల్పిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. రాంకీ అప్పటి సీఈవో ఎఎన్ వీరారెడ్డి కలెక్టర్ ఆదేశాల మేరకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. ఈ సంఘటన జరిగి ఇప్పటికీ 12 ఏళ్ల ... మిగతా 8వ పేజీలో



మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తామని 2012వ సంవత్సరంలో రాంకీ యాజమాన్యం ఇచ్చిన హామీ పత్రం

పెద్దేరుకు ఎంత కష్టం!

- కుడి కాలువ గట్లకు పలుచోట్ల గండ్లు, పేరుకుపోయిన పూడిక
- రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో వేలాది ఎకరాలకు అందని నీరు
- కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు

ఆధునికీకరిస్తామని గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నీటి మూటలే..

బుచ్చెయ్యపేట/ రావికమతం, జూలై 14:

పెద్దేరు ప్రాజెక్టు ఆధునికీకరణకు గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరలేదు. దీంతో సాగునీరు అందక బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టడంతో తమ కష్టాలు తీరతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



రావికమతం మండలంలోని కొరెడ్ల వారి కల్లాల సమీపంలో పూడుకుపోయిన కాలువ



బుచ్చెయ్యపేట మండలంలో పూడుకుపోయిన పెద్దేరు రిజర్వాయర్ కాలువ

మాడుగుల మండలం రావిపాలెం సమీపంలో పెద్దేరు నదిపై జలాశయం నిర్మించి దశాబ్దన్నర కాలం పైగా అవుతున్నప్పటికీ ఇంతవరకు ఒక్క ఏడాది కూడా పూర్తి ఆయకట్టుకు నీరు అందలేదు. కుడి కాలువ కింద రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో తొమ్మిది వేల ఎకరాల ఆయకట్టు వుంది. రిజర్వాయర్ నిర్మాణం తరువాత రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో కొంత ఆయకట్టుకు రెండు మూడేళ్లు మాత్రమే నీరందింది. కాలువల డిజైన్ సరిగా లేకపోవడం, కాలువ తవ్వకంలో సాంకేతిక తప్పిదాల కారణంగా నీరు సరిగా ప్రవహించక గట్లకు గండ్లు ... మిగతా 8వ పేజీలో

రహదారులు ఇలా.. వెళ్లేదెలా?

అధ్వానంగా తాండవ- నాతవరం రోడ్డు

- వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు



అధ్వానంగా ఉన్న తాండవ రోడ్డు

నాతవరం, జూలై 14:

అడుగడుగునా గోతులు.. జిగ్ జాగ్‌గా వెళ్లాల్సిన పరిస్థితులు.. మండలంలోని తాండవ- నాతవరం రహదారిలో ప్రయాణించే వాహనచోదకులకు తప్పని అవస్థలు. ఈ రహదారి అధ్వానంగా ఉన్నా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అలాగే గొలుగొండ మండలంలోని పలు రహదారుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కూటమి ప్రభుత్వ హయాంలోనైనా తమ కష్టాలు తీరతాయని వాహనచోదకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని తాండవ- నాతవరం రోడ్డు గోతులతో దారుణంగా ఉంది. మాధవనగరం, అడాకుల, చమ్మచింత, కురువాడ గ్రామాలతో పాటు గొలుగొండ మండలాన్ని ... మిగతా 8వ పేజీలో



గోతులమయంగా ఉన్న పాతకృష్ణాదేవిపేట రహదారి

కేజేపురంలో దారుణ హత్య

కాలువ విషయమై ఇద్దరి మధ్య గొడవ

- కత్తితో మెడపై నరకడంతో ఒకరి మృతి

మాడుగుల, జూలై 14:



హత్యకు గురైన సూర్యనారాయణ (ఫైల్)

పంట పొలాలు, కళ్లాల వద్ద కాలువ గొడవ విషయమై ఇద్దరి మధ్య నెలకొన్న తగాదా హత్యకు దారితీసింది. దీనికి సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలో కస్పా జగన్నాథపురం గ్రామ సమీపంలో గల చెరకు కాటా సమీప కళ్లాల వద్ద ఉన్న కాలువ విషయమై అదే గ్రామానికి చెందిన సూరిశెట్టి సూర్యనారాయణ (70), సూరిశెట్టి నర్సింగరావు(43)ల మధ్య ఆదివారం సాయంత్రం వివాదం చోటుచేసుకుంది. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ తీవ్ర స్థాయికి చేరుకోవడంతో సూరిశెట్టి నర్సింగరావు తన చేతిలో ఉన్న కత్తితో సూరిశెట్టి సూర్యనారాయణ మెడపై నరికి హతమార్చాడు. ఈ విషయం స్థానికులకు తెలియడంతో అక్కడకు పరుగులు తీశారు. అయితే ఈ సంఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు. కాగా రాత్రయినా సంఘటన స్థలం వద్దనే మృతదేహం ఉంది.

బలిఘట్టంలో ఇసుక అక్రమ నిల్వలు

- టిప్పర్లతో రాజమండ్రి నుంచి తీసుకొచ్చి అమ్మకాలు
- ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా
- ఇష్టానుసారం ఇసుక ధరలు పెంచి విక్రయం



ట్రాక్టర్‌లోకి ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, జూలై 14 : పలు ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టిప్పర్లతో రాజమండ్రిని నుంచి ఇసుక తీసుకొచ్చి బలిఘట్టం, చెట్టుపల్లిలో పోగులు పెట్టి నిల్వ ఉంచుతున్నారు. ఇప్పటికే గబ్బాడ ఇసుక డిపోలో అవకతవకలపై సభాపతి అయ్యన్నపాత్రుడు అధికారులకు విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. విచారణ పూర్తయ్యే వరకు డిపోలో ఇసుక బయటకు తీయవద్దని స్పష్టం చేశారు. దీన్ని అదనుగా తీసుకొని రాజమండ్రి నుంచి టిప్పర్లతో ఇసుక అక్రమంగా తరలించి వ్యాపారం చేస్తున్నారు. నిబంధనలు ప్రకారం రాజమండ్రి ఇసుక ర్యాంప్ నుంచి 20కిలోమీటర్లు పరిధి దాటి ఇసుక రవాణా చేయకూడదు. సొంత అవసరాలకు మాత్రమే వాడుకోవాలి. అధికారులు పట్టించుకోకపోవడంతో దర్జాగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే.. రెవెన్యూ సెబ్, పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసే అధికారం ఉంది. మైనింగ్ అధికారులు అపరాధ రుసుం వసూలు చేస్తారు.

టిప్పర్లతో తీసుకొచ్చిన ఇసుక బలిఘట్టం కాటా సమీపం వద్ద చెట్టుపల్లి, మరికొన్ని ప్రాంతాలలో అక్రమంగా నిల్వ ఉంచి ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకకు రూ.5 వేలు నుంచి రూ.7 వేలు చొప్పున వసూలు చేస్తున్నారు. బుధవారం ఉదయం బలిఘట్టం వై జంక్షన్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ని సీజ్ చేశామని ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. అయితే అధికారులు మాత్రం అడపాదడపా చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలోనే నర్సీపట్నం మైనింగ్ అధికారులు రూ.10 వేలు అపరాధ రుసుం రాసినట్టు చెప్పారు. ఈ విషయమై సబ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ దృష్టికి తీసుకు వెళ్లగా ఇసుక అక్రమ నిల్వలపై చర్యలు తీసుకుంటున్నామని, రెండు రోజుల కిందట మూడు ట్రాక్టర్లను సీజన్ చేశామని తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలపై గట్టి నిఘా ఉంచామన్నారు.

దాడికి గురైన కానిస్టేబుల్‌ను పరామర్శించిన హోం మంత్రి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ అప్పారావును పరామర్శిస్తున్న మంత్రి అనిత

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గంజాయి మత్తులో ఉన్న యువకుడు దాడి చేయడంతో గాయపడి సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సబ్బి అప్పారావును రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం వేర్వేరుగా పరామర్శించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని, నిందితుడ్ని కఠినంగా శిక్షిస్తామన్నారు. అప్పారావు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పోలీసుల్లో ఆత్మస్థైర్యం నింపేలా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సీపీ మాట్లాడుతూ శాఖాపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని అతని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. కాగా దాడికి పాల్పడిన భార్గవ్‌రెడ్డిపై త్రీ టౌన్ పోలీసులు బీఎన్ఎస్ 121(2) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి ఆదివారం న్యాయమూర్తి ముందు హాజరుపరచగా ఏడు రోజులు రిమాండ్ విధించారు.

జిల్లా బ్రాహ్మణ సేవా సంఘ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కొత్తూరు, జూలై 14 : ఇక్కడి రోటరీ క్లబ్‌లో జిల్లా బ్రాహ్మణ సేవా సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. గౌరవాధ్యక్షులు కస్నేపల్లి గౌరీపతి, రేజేటి రామాచార్యులు, కె.విశ్వనాథం ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంటి రవికుమార్, ఉపాధ్యక్షుడు పేరూరి భోగలింగం, ప్రధాన కార్యదర్శి టీవీ మల్లికార్జున ప్రశాంత్, సహాయ కార్యదర్శులుగా దొరబాబు, సురేగా, ట్రెజరర్‌గా కామేష్, జాయింట్ ట్రెజరర్లుగా సోమశేఖర్, తమ్మిరాజు శ్యామ్‌కుమార్‌లతో పాటు పలువుర్ని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ అనకాపల్లిలో బ్రాహ్మణులకు సరైన కమ్యూనిటీ భవనం లేదన్నారు. అంతా ఐకమత్యంతో సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘం పెద్దలు పాల్గొన్నారు.

తూర్పుకోస్తా రైల్వే, టీసీఎఫ్‌ఏ జట్లు గెలుపు



రైల్వేస్, మరిడిమాంబ జట్ల మధ్య మ్యాచ్

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 14: ఏయూ గ్రౌండ్‌లో జరుగుతున్న జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తూర్పుకోస్తారైల్వే, టీ కోర్టు ఫుట్‌బాల్ అసోసియేషన్ (టీసీఎఫ్‌ఏ) జట్లు గెలుపొందాయి. సాయంత్రం జరిగిన తొలి మ్యాచ్‌లో రైల్వే 3-0 గోల్స్ తేడాతో మరిడిమాంబ ఫుట్‌బాల్ క్లబ్‌పై విజయం సాధించింది. ఆట ప్రథమార్థంలో రైల్వే ఆటగాళ్లు సాయి, సురేష్ చెరో గోల్ చేయగా, రెండో భాగంగా సీనియర్ ఆటగాడు సీతారామరాజు మరో గోల్ చేసి ఆధిక్యాన్ని పెంచాడు. మరో మ్యాచ్‌లో టీసీ ఎఫ్‌ఏ 1-0 గోల్‌తో కోదండరామ ఫుట్‌బాల్ క్లబ్‌పై (ఎస్‌కేఆర్‌ఎఫ్‌సీ) గెలుపొందింది. ప్రథమార్థం హోరాహోరీగా సాగిన ఈమ్యాచ్‌లో ఇరుజట్లు గోల్ సాధించలేకపోయారు. రెండోభాగంలో టీసీఎఫ్‌ఏ స్ట్రైకర్ సాయి శివరామ తేజ గోల్ చేసి జట్టుకు విజయాన్నందించాడు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

పచ్చని పార్కుపై.. పంచాయతీ నిర్లక్ష్యం!

కొరవడిన పరిశుభ్రత

- ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం
- పాముల సంచారంతో అడుగు పెట్టాలంటేనే భయం
- ఆహ్లాదకర వాతావరణానికి దూరమవుతున్న 'పేట'వాసులు



పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారం



పాయకరావుపేటలో గల దాసరి గవర్రాజు స్మారక పార్కు

పాయకరావుపేట, జూలై 14 : పచ్చని మొక్కలు, అందమైన పూల పరిమళాలతో సందర్శకులకు ఆహ్లాదం పంచాల్సిన పాయకరావుపేటలోని దాసరి గవర్రాజు పార్కు నేడు పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారింది. గత కొంతకాలంగా దీని నిర్వహణను పట్టించుకునేవారు లేకపోవడంతో అధ్వానంగా తయారైంది. పార్కు ఆవరణలో శుభ్రం చేయక ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోగా, తోపుడు బళ్ళను పార్కులో పెడుతుండడంతో మరింత కళావిహీనంగా కనిపిస్తోంది. దీనికితోడు పాములు సంచరిస్తుండడంతో పార్కులో ఉన్న లైబ్రరీకి సైతం వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు.



అధ్వాన్నంగా ఉన్న రీడింగ్ రూమ్ పరిసరాలు

పట్టణంలోని సూర్యమహల్ సెంటర్‌లో దశాబ్దకాలం క్రితం వరకు అధ్వానంగా ఉన్న దాసరి గవర్రాజు స్మారక పార్కును అప్పటి పంచాయతీ సర్పంచ్ పెదిరెడ్డి చిట్టిబాబు సహాయ సహకారాలతో అన్ని వసతులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. అదేవిధంగా పార్కు ఆవరణలో ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలోనే మొట్టమొదటి ఏసీ శాఖా గ్రంథాలయం ఏర్పాటు చేయడం జరిగింది. రోజూ పార్కును శుభ్రంచేసి, పూల మొక్కల సంరక్షణకు పంచాయతీ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. అయితే గత కొంతకాలంగా పార్కును పట్టించుకున్నవారు లేకపోవడంతో పాటు పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పార్కులో పిల్లల ఆట వస్తువులు పాడయ్యాయి. ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు బయటి వ్యక్తులు పార్కు ఆవరణలో తోపుడు బళ్ళు, ఇతర సామగ్రిని పెడుతుండడంతో మరింత అధ్వానంగా దర్శనమిస్తోంది. దీనికితోడు పాములు సంచరిస్తుండడంతో పార్కులోకి ఎవరూ రాకపోగా పార్కు ఆవరణలో ఉన్న లైబ్రరీకి వచ్చేందుకు కూడా ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును తీర్చిదిద్దాలని పట్టణవాసులు కోరుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావును వివరణ కోరగా, పార్కు నిర్వహణకు పంచాయతీ సిబ్బంది ఉన్నా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. దీనిపై పలుమార్లు పంచాయతీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతోందన్నారు.



తోపుడు బళ్ళును పెట్టిన దృశ్యం

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలి

- యూటీఎఫ్ నాయకుల డిమాండ్
- సీఐటీయూ కార్యాలయం వద్ద ఆందోళన




జీవో ప్రతులను దగ్ధం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనకాపల్లి టౌన్, జూలై 14: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చినబ్బాయి డిమాండ్ చేశారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయం వద్ద ఆదివారం సదరు జీవో ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా చినబ్బాయి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏళ్ల తరబడి ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు సాగిస్తున్నట్టు చెప్పారు. కూటమి అధికారంలోకి వస్తే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తుందని నమ్మామని, కానీ కొత్త ప్రభుత్వ హయాంలో జీపీఎస్‌ను చట్టబద్ధం చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ రావడం చాలా అన్యాయమన్నారు. ఎన్నికల ముందు పవన్ కల్యాణ్, లోకేశ్‌లు కూటమి అధికారంలోకి వస్తే సీపీఎస్ స్థానంలో జీపీఎస్ కంటే మెరుగైన విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అమలు చేయాలని చూస్తే పోరాటాలకు సన్నద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లయ్యబాబు, ఎంవీ అప్పారావు, జిల్లా కార్యదర్శి శేషుబాబు, కోశాధికారి జోగా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : జీపీఎస్ విధానం 2023 అక్టోబరు నుంచే అమలులోకి వచ్చిందంటూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం తగదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు, ప్రతినిధి ఎస్.దుర్గాప్రసాద్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. దీనిని తమ ఫెడరేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు తీవ్రంగా నష్టపోయే ఈ జీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేస్తూ సవరణ గెజిట్ విడుదల చేయాలని వారు కోరారు.

98 మీటర్లకు చేరిన 'కోనాం' నీటిమట్టం



నీటితో కళకళలాడుతున్న కోనాం జలాశయం

చీడికాడ, జూలై 14: మండలంలోని కోనాం జలాశయం ఎగువన ఏజెన్సీ అటవీ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండటంతో నీటి ప్రవాహం పెరుగుతూ జలాశయానికి గెడ్డల ద్వారా సాగునీరు చేరుతోంది. అయితే అధికారుల నిర్లక్ష్యమో, రైతుల శాపమో తెలియదు గాని వచ్చిన నీటిలో 50 క్యూసెక్కుల మేర మెయిన్‌గేట్లు ద్వారా ప్రతిరోజు దిగువ కాలువకు వృథాగా కిందికి పోతోంది. దీంతో ఎగువ కాలువ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు. ఆదివారం సాయంత్రానికి 98 మీటర్లకు చేరు కొంది. ఇన్‌ఫ్లో 200 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 50 క్యూసెక్కులు కాగా, గత ఏడాది ఇదేనెల ఇదే రోజు నాటికి 95.25 మీటర్లు నీటిమట్టం ఉంది. అయితే ఈ నెల 14 నాటికి నీటిమట్టం పెరగడంతో సాగురైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.



మెయిన్ గేటు ద్వారా వృథాగా పోతున్న నీరు

తాండవ నదిలోకి వర్షపునీరు

- మినీ ఆనకట్టల వద్ద జలకళ
- ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు



పాయకరావుపేటలోని భూమి ఆనకట్ట వద్ద పారుతున్న నీరు

పాయకరావుపేట, జూలై 14: గత కొద్ది రోజులుగా ఎగువ ప్రాంతంలో పడుతున్న వర్షాలకు పాయకరావుపేట వద్ద తాండవ నదికి జలకళ సంతరించుకుంది. పట్టణ పరిధిలోని నదిపై ఉన్న భూమి ఆనకట్టకు నీరు చేరుతుండడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తాండవ నదిపై ఉన్న భూమి, ముఠా ఆనకట్టల ద్వారా పాయకరావుపేట, నక్కపల్లి, తుని మండలాల్లో భూములకు ఏటా ఖరీఫ్‌లో సాగు నీరందుతోంది. ఆనకట్టలపై ఆధారపడి పలు గ్రామాల్లో రబీలో కూడా రైతులు పంటలు సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో ఆనకట్టల మధ్య నీరు నిల్వ ఉంటున్నందున పట్టణ పరిధిలో భూగర్భజలాలు వృద్ధి చెంది తాగునీరు పుష్కలంగా లభిస్తోంది. ప్రస్తుతం ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమై నెల కావస్తున్నా తాండవ నది ఎగువ ప్రాంతంలో సరైన వర్షాలు లేకపోవడంతో నదిలోకి పెద్దగా నీరు చేరలేదు. అయితే గత కొద్ది రోజులుగా పడుతున్న వర్షాలకు తాండవ నదిలోకి నీరు చేరుతుండడం ప్రారంభమైంది. దీంతో పట్టణంలోని భూమి, ముఠా, మంగవరం చానెళ్ల ద్వారా ఆయకట్టు భూములకు నీరంద నుంది. దీనికితోడు మండలంలో అడపాదడపా పడుతున్న వర్షాలకు పలు గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లోకి నీరు చేరడంతో నారుమడులు వేసే పనిలో రైతులు ఉన్నారు. అయితే ఈ ఏడాది కూడా పంట కాలువల్లో పూడిక తీయకపోవడం, పాడైన డివిజన్‌డ్యామ్‌లు, గేట్ల మరమ్మతులు కారణంగా నీరు వృథాగా పోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థుల కోసం లయన్స్ గ్రంథాలయం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రరీ సౌకర్యం
- రూ.20 లక్షలతో ఏర్పాటు
- అందుబాటులో 2300కు పైగా పుస్తకాలు



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న పాఠకులు

నర్సీపట్నం, జూలై 14 : జిల్లాలో ఏ జూనియర్ కళాశాలకు లేని గ్రంథాలయం సౌకర్యం నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉంది. ఇది విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు, పుస్తక ప్రియులకు ఎంతో ఉపయోగపడుతోంది. ఈ లైబ్రరీలో దినపత్రికలతో పాటు అకడమిక్, పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉండటంతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా మారింది.

ఈ కళాశాలలో రూ.20 లక్షలతో లయన్స్ క్లబ్ వారు గ్రంథాలయం భవనాన్ని నిర్మించి గత సంవత్సరం ఇంటర్నేషనల్ గవర్నర్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఇందులో 150 పైగా పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ మరో 150 పోటీ పరీక్షలు, వివిధ రకాల పుస్తకాలు వితరణ చేశారు. ప్రస్తుతం లైబ్రరీలో 2,300 పైగా పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. పాఠ్య పుస్తకాలు సమకూర్చడంతో పేద విద్యార్థులకు ఉపయోగ పడుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 20 ఉండగా, కేవలం నర్సీపట్నం జూనియర్ కళాశాలలో మాత్రమే ఇన్ని సదుపాయాలతో లైబ్రరీ సౌకర్యం అందుబాటులో ఉండడం విశేషం. మిగిలిన కళాశాలలో గ్రంథాలయాధికారులు పోస్టులు ఉన్నప్పటికీ భవనాలు అందుబాటులో లేక ఉపయోగం ఉండటం లేదు. నర్సీపట్నంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రరీ, గ్రంథాలయాధికారి, పోటీ పరీక్షలు, రిఫరెన్స్ ఎకడమిక్ పుస్తకాలు అందుబాటులో ఉండటంతో విద్యార్థులకు మేలు కలుగుతోంది.

లయన్స్ క్లబ్ దత్తత కళాశాల...

లయన్స్ క్లబ్ ఈ కళాశాలను దత్తత తీసుకొని గత పదేళ్లుగా విద్యార్థులకు అవసరమైన వసతులు సమకూర్చుతోంది. ప్రతిసంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ, క్రీడా పరికరాలు పంపిణీ చేస్తున్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారు. విద్యార్థుల ప్రగతికి కారణమైన అధ్యాపకులను ఏటా సెప్టెంబరు 5 గురు పూజోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించి ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల 35 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. గత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించిన ఆరుగురు మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు.

కృష్ణావతారంలో జగన్నాథస్వామి



కృష్ణావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 14: పట్టణంలోని గూడ్స్ షెడ్డు వద్ద గల ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి ఆదివారం కృష్ణావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ తొలుత స్వామివారికి విశేష అలంకరణలు చేపట్టి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కుటుంబాలతో సహా తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజ సులోచన, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చోడవరంలో రామావతారం



జగన్నాథుని రథోత్సవాల సందర్భంగా దశ రూప మహోత్సవాల్లో భాగంగా ఆదివారం జగన్నాథస్వామి రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. - చోడవరం

శ్రీరామావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి

భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం



రద్దీగా ఉన్న క్యూ లైన్లు



బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూలై 14: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము ఆరు గంటలకు బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. విశాఖ ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి రావడంతో అన్నిమార్గాలు సందడిగా మారాయి. కుటుంబాలతో సహా విచ్చేసిన పలువురు భక్తులు ఆలయ పరిసరాల్లో వంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన అనంతరం ఆరగించారు. ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సీఐ పి.పైడపునాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

వైజాగ్ వారియర్స్‌కు రూ.10 లక్షల నజరానా

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 14: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 చాంపియన్‌గా నిలిచిన వైజాగ్ వారియర్స్‌కు ఫ్రాంచైజ్ సహ యజమాని డాక్టర్ నరేంద్రరామ్ రూ.పది లక్షల నగదు బహుమతిని అందజేసి అభినందించారు. ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శనివారం జరిగిన ఫైనల్స్‌లో వైజాగ్ వారియర్స్ 87 పరుగుల తేడాతో ఉత్తరాంధ్ర లయన్స్‌ను చిత్తుచేసి ట్రోఫీని కైవసం చేసుకుంది. టోర్నీ ఆద్యంతం రాణించడమే కాకుండా ఫైనల్స్‌లోనూ ఉత్తరాంధ్ర లయన్స్‌పై అద్భుత విజయం సాధించి సీజన్-3 టైటిల్‌ను సొంతం చేసుకోవడం ఆనందాయకమన్నారు.

'రాంకీ' ఉపాధి హామీ హుళక్కేనా?

... 5వ పేజీ తరువాయి

కావస్తోంది. ప్రభుత్వాలు మారినా మత్స్యకారుల ఉపాధి మాత్రం ఎండమావిగానే మిగిలిపోయింది. దీనికితోడు ఇటీవల ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో భారీ ఎత్తున చేపలు మృతి చెందిన సంగతి తెలిసిందే. దీని కారణంగా మత్స్యకారులకు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. ఫార్మా వ్యర్థ జలాల కారణంగానే చేపలు మృత్యువాత పడ్డాయని మత్స్యకారులు గగ్గోలు పెట్టారు. ఇదే పరిస్థితి భవిష్యత్తులో కొనసాగుతుందేమోనన్న ఆందోళన మత్స్యకారుల్లో నెలకొంది. ఇప్పటికే ఫార్మా కాలుష్యంతో చేపల వేట కూడా అంతంత మాత్రంగానే సాగుతోంది. దీని వల్ల మత్స్యకారుల జీవనోపాధి అగమ్యగోచరంగా తయారైంది. వేట సాగక, ఉపాధి లేక కొంతమంది మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలస పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో మత్స్యకారులు ఉపాధి కోసం రాంకీ వద్ద ఆందోళన చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఫార్మాసిటీ వల్ల తమ బతుకులు రోడ్డున పడ్డాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే రాంకీ ఒప్పందం మేరకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మత్స్యకారులకు తీరని అన్యాయం

రాంకీ యాజమాన్యం మత్స్యకారులకు తీరని అన్యాయం చేసింది. ఫార్మా వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా సముద్రంలోకి విడిచిపెట్టడంతో మత్స్యసంపద నశించిపోతోంది. దీని వల్ల మత్స్యకారుల జీవనోపాధి అగమ్యగోచరంగా మారింది. మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తామని రాంకీ యాజమాన్యం ఇచ్చిన హామీని నెరవేర్చాలి. హామీ నెరవేర్చకపోతే రాంకీ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేపడతాం. ఈ విషయం పై ప్రభుత్వం జోక్యం చేసుకుని మత్స్యకారులకు ఉపాధి కల్పించేలా రాంకీపై ఒత్తిడి తీసుకురావాలి.

- చింతకాయల సుజాత, ముత్యాలమ్మపాలెం సర్పంచ్

విశాఖ భూ దందాపై ప్రభుత్వం ఫోకస్!

... 5వ పేజీ తరువాయి

నివేదిక రూపొందించినట్టు తెలిసింది.

బే పార్కుతో ప్రారంభం

విశాఖలో బేపార్కు నుంచి భూ దందాల పంచాయితీ ప్రారంభమయింది. ఇది వైసీపీ ఐదేళ్ల పాలన ముగిసేవరకు కొనసాగింది. కార్తీకవనం చేజిక్కించుకుని రాడిసిన్ బ్లూ హోటల్ నిర్మాణం, భీమిలిలో భూ యజమానులను బెదిరించి భారీఎత్తున భూములు కారుచౌకగా లాక్కోవడం, దసపల్లా భూములను 22(ఎ) నుంచి తొలగించి ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తెకు చెందిన కంపెనీతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకోవడం వరకు కొనసాగింది. ఈ వ్యవహారంలో అప్పటి ప్రభుత్వంలో కీలక పెద్దల పాత్ర ఉందనేది బహిరంగ రహస్యం. రుషికొండ ప్రాంతంలోని పనోరమ హిల్స్ పరిసరాల్లో పలువురి నుంచి బలవంతంగా ప్లాట్లు తీసుకుని భారీ కట్టడాలు నిర్మిస్తున్నారు. మధురవాడ ఐటీ హిల్స్ సమీపంలో ఎన్‌సీసీకి చెందిన 100 ఎకరాల భూమిని బెదిరింపులకు పాల్పడి టేకోవర్ చేసుకుని, గత ప్రభుత్వంలో పనిచేసిన మంత్రి తమ్ముడికి అప్పగించారు. రుషికొండ తారక రామా లేఅవుట్‌లో రేడియంట్ కంపెనీకి చెందిన 50 ఎకరాలను కూడా లాక్కున్నారు. నగరంలో పలుచోట్ల అడ్డగోలుగా టీడీఆర్‌లు కొట్టేశారు.

అసైన్డ్ భూములపైనా కన్ను

ఇదిలావుండగా గ్రామీణ మండలాలైన ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తిలో అసైన్డ్ భూములను చేజిక్కించుకునేందుకు జీవో 596 జీవో తీసుకువచ్చారు. గత ప్రభుత్వంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కేఎస్ జవహర్‌రెడ్డి బినామీలు త్రిలోక్‌తో పాటు మరికొందరు వందల ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు పొంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇలా సుమారు 2,500 ఎకరాలకు ఒప్పందాలు చేసుకుని, అడ్వాన్స్‌లు ఇచ్చి 500 నుంచి 600 ఎకరాలను రిజిస్టర్ చేసుకున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పరిసరాల్లోని భీమిలి మండలంలో పలువురు రైతులను బెదిరించి భూములు కొట్టేశారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి దృష్టి సారించడంతో విశాఖలో భూదందాలపై విశాఖ ఫైల్స్ పేరిట నివేదిక విడుదల చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రకటించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే భీమిలి నియోజకవర్గంలో పలు ఆక్రమణలు, కబ్జాలపై ఆయన కొంత సమాచారం సేకరించారు.

'పెద్దేరు'కు ఎంత కష్టం!

... 5వ పేజీ తరువాయి

పడడంతో రెండు మండలాల్లో సుమారు తొమ్మిది వేల ఎకరాలకుగాను వెయ్యి ఎకరాలకు మాత్రమే నీరు అందుతున్నది. కాలువల ఆధునికీకరణ పనుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపడం, గత ప్రభుత్వం బుట్టదాఖలు చేయడం పరిపాటిగా మారింది. ఐదేళ్ల క్రితం రూ.32 కోట్లుగా వున్న అంచనా వ్యయం, ప్రస్తుతం రూ.85 కోట్లకు పెరిగింది. పెద్దేరు రిజర్వాయర్ కుడి కాలువ కింద బుచ్చెయ్యపేట మండలంలో ఎర్రవాయి ప్రాంతంగా పిలిచే గున్నెంపూడి, పెదమదీన, కొండపాలెం, కేపీ అగ్రహారం, ఐతంపూడి, బుచ్చెయ్యపేట, పి.భీమవరం, కందిపూడి, దిబ్బిడి, కొండెంపూడి గ్రామాలకు చెందిన 4,500 ఎకరాలు, రావికమతం మండలంలో కవ్వగుంట నుంచి పిల్లవానిపాలెం వరకు 17 గ్రామాల పరిధిలో 4,513 ఎకరాల ఆయకట్టు వుంది. కాలువ నుంచి చెరువుల్లోకి నీటిని మళ్లిస్తే ఆయకట్టు విస్తీర్ణం పెరగడంతోపాటు రెండో పంట కూడా పండించుకోవచ్చని రైతులు ఆశించారు. అయితే కాలువ తవ్వకం సమయంలో ఇంజనీరింగ్ అధికారుల ప్రణాళికా లోపం, వైఫల్యంతో అన్నదాతల కలలు కల్లలయ్యాయి. ఎగువన వున్న రావికమతం మండలంలో కన్నా బుచ్చెయ్యపేట మండలంలో కాలువ ఎత్తుగా వుండడంతో నీరు సరిగా ప్రవహించక లోతట్టు ప్రాంతాల్లో కాలువ గట్లకు గండ్లు పడడం మొదలైంది. ఇంజనీరింగ్ అధికారులు పలుమార్లు పనులు చేయించినా ఫలితం లేకపోయింది. రిజర్వాయర్‌లో ఏడాది పొడవునా నీరు పుష్కలంగా వుంటున్నప్పటికీ కాలువ అధ్వానంగా వుండడం, నీటిని విడుదల చేస్తే కాలువ గట్లకు గండ్లు పడుతుండడంతో ఆయకట్టుకు నీటి సరఫరాను నిలిపేశారు. మొత్తం మీద రావికమతం మండలంలో కవ్వగుంట, బుడ్డిబంద, చినపాచిల, కేబీపీ అగ్రహారం గ్రామాల పరిధిలో వెయ్యి ఎకరాలకు మాత్రమే అరకొరగా సాగునీరు అందుతున్నది. ఇదిలావుండగా నీరు సాఫీగా ప్రవహించేలా కాలువ డిజైన్ మార్చడంతోపాటు సిమెంట్ లైనింగ్ చేయాల్సిన అవసరం వుందని గుర్తించిన ఇంజనీరింగ్ అధికారులు ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపడం, నిధులు మంజూరు కాకపోవడం ఆనవాయితీగా మారింది. కాగా 2023 మార్చిలో రిజర్వాయర్ అభివృద్ధికి రూ.84.4 కోట్ల నిధులు మంజూరైనట్టు అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చేసిన ప్రకటనతో రైతుల్లో ఆశలు చిగురించాయి. మంజూరైన నిధులతో రిజర్వాయర్ అభివృద్ధితో పాటు రూ.40 కోట్లతో ఆర్ఎంసీ, ఎల్ఎంసీ చానల్స్ సీసీ కాంక్రీట్‌తో లైనింగ్ పనులు చేపడతామని బూడి చేసిన ప్రకటన మేరకు ధీమా పడిన పది గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు వేలాది ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టారు. అయితే ఆధునికీకరణ పనులు ప్రకటనకే పరిమితమయ్యాయి. గత ఖరీఫ్‌లో ఏర్పడ్డ వర్షాభావానికి పంటలు దెబ్బతిన్నాయి. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు.

4ఎల్ కాలువ పనులూ అంతే!

పెద్దేరు ఎడమ ప్రధాన కాలువ పరిధిలోని 4ఎల్ మైనర్ కాలువ కింద మాడుగుల మండలం ఎల్.గంగవరం, పొన్నవోలు, ఓంప్రువీధి, ఎల్.కృష్ణాపురం, గదబవీధి, పాత గవరవరం, కాకంకోట, కోండ్లపాడు గిరిజన గ్రామాల్లో 847 ఎకరాల ఆయకట్టు వుంది. కానీ కాలువలో తుప్పలు పెరిగిపోయి, పూడిక పేరుకుపోయింది. కొన్నిచోట్ల గట్లు బలహీనంగా వున్నాయి. దీంతో ఆయకట్టుకు నీరు సరిగా అందడంలేదు.

గత పాలకుల హామీలతో మోసపోయాం

పెద్దేరును ఆధునికీకరిస్తామని గత వైసీపీ పాలకులు ఇచ్చిన హామీలకు మోసపోయాం. రిజర్వాయర్ కుడి కాలువను సీసీ కాంక్రీట్‌తో లైనింగ్ చేస్తామని వైసీపీ పాలకులు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. గత ఏడాది అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నిధులు మంజూరయ్యాయని చేసిన ప్రకటన ఎన్నికల స్టంట్‌గా గుర్తించలేకపోయాం. కాలువ ఆధునికీకరణ జరుగుతుందన్న ధీమాతో గత ఖరీఫ్‌లో సాగు చేపట్టాం. అయితే వర్షాభావానికి వేలాది మంది రైతులు పంటలు కోల్పోయారు. కూటమి ప్రభుత్వం కుడి కాలువను ఆధునికీకరించి, రైతులను ఆదుకోవాలి.

- తుమ్మలపూడి నాగరాజు, రైతు, గున్నెంపూడి



జిమ్ జంక్షన్ వద్ద రాళ్లు తేలిన రహదారి



రాత్రి పది గంటల సమయంలోనూ స్టేషన్ రోడ్డులో వాహనాల రాకపోకలు

ప్రయాణం.. ప్రమాదం

- అనకాపల్లిలో అస్తవ్యస్తంగా మారిన రైల్వే స్టేషన్ రోడ్డు
- ఎక్కడికక్కడ గోతులు పడినా ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టని ప్రజాప్రతినిధులు
- వర్షాలకు నీరు చేరుతుండడంతో ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- కూటమి ప్రభుత్వం మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

అనకాపల్లి టౌన్, జూలై 14 : పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రయాణం వాహనచోదకులకు ప్రాణసంకటంగా మారింది. అడుగడుగునా గోతులు పడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రహదారిపై కన్నెత్తి చూసేవారు లేకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. చోడవరం, మాడుగుల, పాడేరు నియోజకవర్గాలకు చెందిన ప్రజలే కాకుండా పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే, పట్టణ నడిబొడ్డు గుండా కాకుండా రైల్వేస్టేషన్ రింగురోడ్డు మీదుగా అనకాపల్లి మెయిన్‌రోడ్డుకు చేరుకుంటారు. విశాఖ, విజయనగరం మార్గాల వైపు వెళ్లే ప్రయాణికులకు ఈ రైల్వేస్టేషన్ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. దీంతో ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటుంది. ద్విచక్ర వాహనచోదకులే కాకుండా భారీ వాహనాలు కూడా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రహదారి మరింత దెబ్బతింది. ఆయా గోతుల్లో వర్షపు నీరు చేరుతుండడంతో రోడ్డు ఎక్కడో, గొయ్యి ఎక్కడో గుర్తించలేని పలువురు వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అనకాపల్లి - చోడవరం మార్గంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రారంభంలోనే రహదారి అధ్వానంగా మారడంతో పాటు సమీపంలోని జిమ్ జంక్షన్, యల్లయ్యకాలువ వద్ద, లక్ష్మీదేవిపేట రైల్వే గేటుకు వెళ్లే జంక్షన్, గూడ్స్‌షెడ్డు వద్ద మరింత అధ్వానంగా తయారైంది. అసలే ఒక పక్క రహదారి దెబ్బతిని ఉంటే, మరో పక్క జీవీఎంసీ అధికారులు వాటర్ పైపులైన్ నిర్మాణం కోసం రోడ్డును తవ్వేసి తిరిగి రోడ్డు వేయకపోవడంతో పరిస్థితి దుర్భరంగా మారింది. దీంతో జనం అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ రహదారి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.





రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలోని దెబ్బతిన్న రహదారి (అంతర్ చిత్రం) రైల్వే గేటుకు వెళ్లే దారిలో దుస్థితి

బ్రాండిక్స్ ఆధ్వర్యంలో 450 మందికి కంటి పరీక్షలు

అచ్యుతాపురం రూరల్, జూలై 14 : బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటైంది. తొలుత ఈ శిబిరాన్ని సంస్థ ఇండియా ప్రతినిధి దొరస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 129 కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే, పరిసర ప్రాంత ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం 450 మందికి వైద్యులు, సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే, ఇటీవల నిర్వహించిన శిబిరంలో 229 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించడంతో వారికి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. కేటరాక్ట్ ఆపరేషన్ల నిమిత్తం మరో 50 మందిని వైద్యులు ఎంపిక చేశారు. కంపెనీ ప్రతినిధులు రోగులకు అల్పాహారం, భోజనం, రవాణా వంటి సౌకర్యాలను కల్పించారు.



శిబిరంలో కంటి పరీక్షలు జరపుతున్న వైద్య సిబ్బంది

జగన్నాథస్వామిని దర్శించుకున్న 'బుద్ద'



స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద

అనకాపల్లి టౌన్, జూలై 14 : ఇక్కడి ఇంద్రజ్యమ్మ హాల్‌లో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామిని ఆదివారం రాత్రి మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ధర్మకర్తలు ఆయనను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. టీడీపీ నాయకులు బొడ్డేడ మురళీ, బుద్ద లక్ష్మీఅప్పారావు, బోడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల అండదండలతో అక్రమ క్వారీలు

- మైనింగ్ అధికారులు తక్షణమే స్పందించాలి
- జనసేన నేత రామ గోవిందరావు

పరవాడ, జూలై 14 : మండలంలో వైసీపీ నాయకుల అండదండలతో నడుస్తున్న అక్రమ క్వారీలపై తక్షణమే మైనింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ కార్యదర్శి బుగిడి రామగోవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెదముషిడివాడ, ఇ.బోనంగి, పరవాడ రెవెన్యూ పరిధిల్లో గల క్వారీల్లో జరుగుతున్న అవినీతిని తక్షణమే అధికారులు అరికట్టాలని కోరారు. ముఖ్యంగా పెదముషిడివాడ పంచాయతీ పరిధి ప్రభుత్వ భూముల్లో గత ఐదేళ్లలో అక్రమంగా గ్రావెల్ తరలించిన వ్యవహారంపై గనులశాఖ తక్షణమే విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. పరవాడ తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న క్వారీలో మైనింగ్ బిల్లులు లేకుండా గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. ఇ.బోనంగి రెవెన్యూ పరిధిలో ఏపీఐఐసీ భూముల్లో అనధికారికంగా అనుమతులు పొందడం వైసీపీ నాయకులకే చెల్లిందని వివరించారు. తక్షణమే అధికారులు స్పందించి ఐదేళ్ల కాలంలో మండలంలో జరిగిన అక్రమ గ్రావెల్ తవ్వకాల పై విచారణ జరిపి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని రామగోవిందరావు డిమాండ్ చేశారు.

'బలిజపాలెంలో రహదారిని తవ్వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

సబ్బవరం, జూలై 14 : మండలంలోని నారపాడు శివారు బలిజపాలెంలో తాసుబిల్లివారి కల్లాలకు వెళ్లే రహదారిని తవ్వేసినవారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకుడు గండి రవికుమార్ డిమాండ్ చేశారు. సదరు ప్రదేశాన్ని ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మూడేళ్ల క్రితం ఇరవై కుటుంబాలకు చెందిన తాసుబిల్లివారి కల్లాలకు వెళ్లేందుకు గెడ్డవాగు భూముల్లో నుంచి అప్పటి నేతలు రహదారి నిర్మించారన్నారు. రైతులు వైసీపీ సానుభూతి పరులు కావడంతోనే అధికార పార్టీ నేతలు కావాలనే కక్ష పూరితంగా రోడ్డును తవ్వేశారని ఆరోపించారు. ఆయన వెంటన గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ తాసుబిల్లి కనకరాజు, ఎస్.దుర్గఅప్పారావు, మామిడి కొండాజీ, యర్ర నాయుడు, ఐడి బాబు, టిఈశ్వరరావు, శ్రీను, గణేష్ ఉన్నారు.

పచ్చదనం పెంపుతో బహుళ ప్రయోజనాలు



తుమ్మపాలలో మొక్క నాటుతున్న గ్రీన్‌క్లబ్ సభ్యులు

తుమ్మపాల, జూలై 14 : పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని గ్రీన్ క్లబ్ ప్రతినిధి కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం తుమ్మపాల, సోహం ఆశ్రమాల్లో క్లబ్ సభ్యులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు అటవీశాఖ అధికారి బి.వినోద్‌కుమార్, తిమ్మాపాత్రుని చక్రవర్తి, సత్యనారాయణ, మళ్ల లోకేశ్, శేషసాయి, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వెంకుపాలెంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుతున్న మహిళలు

కొత్తూరు : అనకాపల్లి మండలం వెంకుపాలెంలో మాజీ సర్పంచ్ ఆడారి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. గ్రామానికి చెందిన మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తామన్నారు.

'జనసేన సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి'

రాంబిల్లి, జూలై 14 : జనసేన పార్టీ నిర్వహించ తలపెట్టిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మండలంలోని వెంకటాపురంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. జన సైనికుల కుటుంబాలకు భరోసా కల్పించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఈనెల 18నుంచి ఈ ప్రక్రియను చేపట్టాలన్నారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేయాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. ఈ సమావేశంలో నాయకులు భైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, పీనూకన్నదొర, బొద్దపు శ్రీనుతో పాటు నాలుగు మండలాల క్లస్టర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : ఇక్కడి శ్రీరామచంద్రమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే విజయకుమార్ దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, యువతతో కలిసి సమస్యలపై చర్చించారు. జనసేన, టీడీపీ పట్టణ అధ్యక్షులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, నాయకులు కొఠారు సాంబ, కొఠారు నరేష్, లవుడు లోవరాజు, గుర్రాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రాంబిల్లి మండలం వెంకటాపురం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

కొత్తూరు/తుమ్మపాల/కశింకోట : అనకాపల్లి నియోజకవర్గంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు పలు గ్రామాల్లో సభ్యత్వ నమోదుపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మాజీ జడ్పీటీసీ భరత్‌బాబు, చదరం నాగేశ్వరరావు, శ్రీరామదాసు గోవింద, తాడి రామకృష్ణ, మళ్ల శ్రీను, దూలం గోపి, అప్పికొండ గణేష్, కశింకోట నాయకులు కర్రి సత్యనారాయణ, బుదిరెడ్డి మోహన్, మజ్జి బాబ్జీ, కలిగట్ల సింహాద్రి, కర్రి లోవరాజు, ఆయినాల నాయుడు పాల్గొన్నారు.



కశింకోట మండలం తాళ్లపాలెంలో సమావేశమైన నాయకులు

తుమ్మపాల : జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 18వ తేదీ నుంచి 28 వరకు చేపట్టనున్నట్టు తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం పార్టీ నాయకులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఆసక్తిగల వారంతా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భరత్‌బాబు, కశిరెడ్డి త్రినాథ్, పీలా తాతునాయుడు, జ్యోతుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లలితాంబ అమ్మవారి జాతర



రాంబిల్లి, జూలై 14 : దిమిలి గ్రామంలో ఆదివారం లలితాంబ అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి పసుపు కుంకుమలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'ఫార్మా వ్యర్థాల పారబోతపై నిఘా ఉంచాలి'

పరవాడ, జూలై 14 : ఫార్మాసిటీలో యాజమాన్యాలు చేపడుతున్న కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు ఫార్మా వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెట్టకుండా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమించాలని మండల తెలుగు యువత అధ్యక్షుడు పైలా చినఅక్కునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పరవాడ ప్రాంతంలో ఎక్కడపడితే అక్కడ ఫార్మా వ్యర్థాలు పారబోత అధికమైందన్నారు. ఇటువంటి తరహా సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పీసీబీ అధికారులు కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

జన్మదిన వేడుకలకు దూరం : రత్నాకర్

అనకాపల్లి టౌన్, జూలై 14 : జన్మదినం సందర్భంగా తాను సోమవారం అనకాపల్లిలో ఉండడం లేదని తెలుగు దేశం పార్టీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు మిత్రులు, శ్రేయోభిలాషులు రావద్దని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు క్రికెట్ కిట్లు పంపిణీ



విద్యార్థులకు క్రికెట్ కిట్ అందజేస్తున్న బాబూరావు

ఎస్.రాయవరం, జూలై 14 : అడ్డరోడ్డు తిమ్మాపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ మండల నాయకుడు సేనాపతి బాబూరావు తన సొంత నిధులతో ఆదివారం కోనవానిపాలెం గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రికెట్ కిట్లు, అంగన్‌వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యాన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అప్పలరాజు, నాగరాజు, అప్పికొండ లోవరాజు, కొండబాబు, సత్యనారాయణ, నానాజీ, దమ్మురాజు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నపాలెంలో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటి వద్ద విలపిస్తున్న బాధితురాలు

నక్కపల్లి, జూలై 14 : ఉపమాక శివారు అయ్యన్నపాలెంలో ఆదివారం ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన యలమంచిలి సత్యవతి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.రెండు లక్షలు ఆస్తినష్టం జరిగినట్టు బాధితురాలు వాపోయింది. ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి వాసు, యలమంచిలి వెంకటేశ్ తదితరులు బాధితురాలిని పరామర్శించారు.

మడుతూరు అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

అచ్యుతాపురం రూరల్, జూలై 14 : మడుతూరును అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గ్రామంలో ఆదివారం ఏర్పాటైన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. గ్రామ సమస్యలు పరిష్కారంతో పాటు చింతలమ్మ గుడికి రోడ్డు వేయిస్తానని, యువతకు కంపెనీలలో ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు భైలపూడి రామదాసు, జిల్లా కార్యదర్శి మోటూరు శ్రీవేణి, నాయకులు త్రినాథస్వామి, మోటూరు గోవింద్, సంతోష్ పాల్గొన్నారు.

రహదారులు ఇలా.. వెళ్లేదెలా?

... 5వ పేజీ తరువాయి

కలిపే ఈ రహదారి ఐదేళ్లుగా గోతులతో దర్శనమిస్తోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో కనీసం మరమ్మతులు చేపట్టలేదు. వర్షాకాలంలో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో రెండేళ్ల క్రితం జనసేన నాయకులు సొంత ఖర్చులతో గోతులను తాత్కాలికంగా పూడ్చారు. అలాగే గత ఏడాది జనసేన, టీడీపీ నాయకులు క్రషర్ బూడిదతో పూడ్చారు. వర్షాలకు మళ్లీ గోతులు పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులు ఈ మార్గంలో ప్రయాణించేటప్పుడు నరకయాతన పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో తమ కష్టాలు తీరతాయని పలు గ్రామాల ప్రజలు ఆశాభావంతో ఉన్నారు.

గొలుగొండ మండలంలో...

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు గోతులతో అధ్వానంగా ఉన్నాయి. ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో వర్షమొస్తే ఆ గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా పాతకృష్ణాదేవిపేట, పల్లావూరు, రామచంద్రపురం, కొంగసింగి, ఏఎల్‌పురం, లింగంపేట తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు దారుణంగా ఉంది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రహదారులకు కనీసం మరమ్మతులు చేయించకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండుగ



ఘటాలతో ఊరేగింపుగా బయలుదేరిన భక్తులు, (పక్కన) ఘటం పట్టుకొన్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, జూలై 14 : మండలంలో ఘాటీరోడ్డు జంక్షన్‌లో గల శ్రీమోదకొండమ్మ అమ్మవారికి సంబంధించి ఘటాల పండగను శ్రీ మోదమాంబ వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ షాపు నుంచి 108 ఘటాలను పెట్టి గ్రామంలో ఊరేగింపుగా చేపట్టి అమ్మవారికి సమర్పించుకున్నారు. ఈ ఘటాల పండుగలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది.

మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారి ఘటాల పండగను నిర్వహించి నెత్తిన ఘటాలతో గ్రామంలో ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించారు.



చీడికాడ : చెరువు కాదు రోడ్డే..



మాకవరపాలెం మండలంలోని ఓ రహదారి



మాకవరపాలెం : గోతులమయంగా రామన్నపాలెం రోడ్డు

దారులు దయనీయం

- గోతులమయంగా రోడ్లు
- వర్షం నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు
- గ్రామీణ రోడ్లపై గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంపై ప్రజల కోటి ఆశలు

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఏ మండలంలోని దారులు చూసినా దయనీయంగా కనిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారుల నిర్వహణ గురించి కనీసంగా పట్టించుకోకపోవడంతో పెద్ద పెద్ద గుంతలుగా మారాయి. ద్విచక్రవాహనాలపై కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఇటీవల వర్షాలు పడుతుండడంతో ఆ గోతుల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు భీతిల్లుతున్నారు. ఎన్నిసార్లు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోలేదంటూ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే రహదారుల మరమ్మతుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చీడికాడ, జూలై 14 : మండలంలో కోనాం నుంచి విజయరామరాజుపేట, శిరిజాం నుంచి ఖండివరం గ్రామాలకు వెళ్లే రహరుల్లో ప్రయాణం నరకయాతనగా ఉంది. మూడు కిలోమీటర్లు మేర రోడ్డు మధ్యలో భారీగా గోతులు పడటంతో ఏ కొద్దిగా వర్షం కురిసినా గుంతల్లో నీరు చేరి చెరువుల్లా కనిపిస్తున్నాయి. దీంతో వాహనదారు లు అవస్థ పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. మాడుగుల నుంచి ఖండివరం, శిరిజాం మీదుగా చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు వెళ్లేందుకు వీలుగా ఉన్న ఈ రహదారిలో వాహనదారలుఽ ఎక్కువగా ప్రయాణిస్తుం టారు. చీడికాడ మండలానికి సంబంధించి విద్య, వైద్యం కోసం వెళ్లేందుకు ఇదే ప్రధానమార్గం. తక్షణమే ఈ రహదా రికి మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రోలుగుంట : వడ్డిప-బుచ్చెంపేట రోడ్డులో అడుగు వేయలేని దుస్థితి

మాకవరపాలెంలో..

మాకవరపాలెం : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామీణా ప్రాంత రోడ్లు జలమయమంగా మారాయి. మండలంలో రామన్నపాలెం, జి.వెంకటాపురం, జంగాలపల్లి, గిడుతూరు రోడ్లు జలమయ్యాయి. ఈ రోడ్లు పెద్ద పెద్ద గోతులతో నిండి ఉండడంతో వర్షం నీరు చేరి తటాకాలను తలపిస్తున్నాయి.దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గర్భిణులు, వృద్ధులు, పిల్లలు ఈ రోడ్లపై వెళ్లేందుకు నానాఅవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఫీట్లు చేయాల్సి వస్తోంది.

రోలుగుంటలో..

రోలుగుంట : మండలంలోని వడ్డిప-బుచ్చెంపేట రోడ్డు అధ్వానంగా మారడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిలో రోజూ వందలాది మంది నర్సీపట్నానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోవడం లేదు. రహదారి పొడవునా అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు దర్శనమిస్తుంటాయి. అందులో వర్షం నీరు చేరడంతో పరిస్థితి మరింత ఇబ్బందిగా తయారవుతోంది.

పలు ప్రాంతాల్లో వర్షం



నర్సీపట్నంలో కురుస్తున్న వర్షం

నర్సీపట్నం, జూలై 14 : నర్సీపట్నంలో ఆదివారం తెల్లవారు జాము నుంచి ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. రోడ్లన్నీ తడిచి ముద్దయ్యాయి. ఆదివారం కావడం, రోజంతా జల్లులు పడటంతో జనం ఇళ్లకు పరిమితమయ్యారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఈ వాన వ్యవసాయ పనులకు బాగా ఉపయోగమని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.అప్పారావు తెలిపారు. ఇప్పటి వరకు 50 శాతం నారు మడులు పూర్తి చేశారని, ఇప్పుడు మిగిలిన 50 శాతం నారు వేసుకోవడానికి ఉపయోగ పడతాయని తెలిపారు.

మాడుగులలో..

మాడుగుల : మాడుగులలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణంలో మార్పులు చల్లబడి వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఓ మోస్తారు వర్షం కురిసింది. అనంతరం ఎడతెరిపిచ్చింది. దీంతో వాతావరణం చల్లబడి ఆహ్లాదంగా మారింది.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి : ఎండిపోతున్న వరి నారుమడులకు ఆదివారం కురిసిన వర్షంతో ఊపిరి పోసింది. గత వారం రోజులు నుంచి రైతులు ఎండిపోతున్న వరినారు మడులను తడపడానికి నానా అవస్థలు పడుతున్నారు. అలాంటిది పది మిల్లీమీటర్లు వర్షం పడడడంతో వరినారుమడులతో పాటు సరుగుడు, కూరగాయల పంటలకు మేలు చేకూర్చింది.



దేవరాపల్లిలో పడుతున్న వర్షం

16న దేవాలయ భూములకు కౌలు వేలం

బుచ్చెయ్యపేట, జూలై 14 : వడ్డాది మల్లికార్జున స్వామి, నీలకంఠేశ్వరస్వామి దేవాలయాల భూములకు ఈ నెల 16న కౌలు వేలం నిర్వహించనున్నట్టు దేవాదాయశాఖ ఈవో శర్మ తెలిపారు. సుమారు ఆరు ఎకరాలకు మూడేళ్ల కాలవ్యవధికి నిర్వహించనున్న కౌలు వేలంలో పాల్గొనే పాటదారులు దేవాలయం ఆవరణలో ఉదయం 12 గంటలకు హాజరు కావాలని కోరారు.

జీపీఎస్ చట్టం రద్దుచేయాలి

ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

బుచ్చెయ్యపేట, జూలై 14 : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన గత వైసీపీ ప్రభుత్వం గత అక్టోబరు నుంచే జీపీయస్ విధానం అమలు చేయడం దుర్మార్గం, మోసపూరితమని ఏపీటీఎఫ్ జిల్లా సంఘాధ్యక్ష, కార్యదర్శులు కేకేఎల్ఎన్ ధర్మారావు, ఎస్.దుర్గాప్రసాద్ విమర్శించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ జీపీయస్ విధానం వల్ల ఉద్యోగ,ఉపాధ్యాయ వర్గాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యంత దుర్మార్గమైన జీపీయస్ విధానాన్ని తక్షణమే రద్దు చేస్తూ సవరణ గెజిట్ విడుదల చేయాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ప్రధాన భూమిక పోషించి, కీలకంగా మారిన ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం జీపీయస్ విధానం గెజిట్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయుల వర్గాలు జీపీయస్ విధానం రద్దు చేస్తుందని ఎంతో నమ్మకంగా ఉన్నారని వారు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న ధర్మారావు, దుర్గాప్రసాద్

నర్సీపట్నం : ప్రభుత్వం జీపీఎస్ చట్టాన్ని రద్దు చేయాలని పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడిగర్ల వరహాలనాయుడు, జీవీ రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలు నెరవేరుస్తుందని ఆశగా ఎదురు చూస్తున్న తరుణంలో చట్టం అమలు చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా సీపీఎస్‌కి ప్రత్యామ్నాయంగా అసెంబ్లీలో జీపీఎస్ బిల్లు పెట్టి చట్టం చేయడం జరిగిందన్నారు. సీపీఎస్ కంటే జీపీఎస్ విధానం చాలా ధారణమైదని, పదవీ విరమణ తర్వాత పీఆర్సీ, హెల్త్ కార్డులు గాని వర్తించవని పేర్కొన్నారు. 2023, అక్టోబరు 20 నుంచే ఈ చట్టం అమల్లోకి వచ్చినట్టు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై పీఆర్టీయూ మండల శాఖ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. తక్షణమే ఈ విషయం మీద ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, లేని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త ప్రభుత్వం మొదటి బహుమతిగా జీపీఎస్ ని ఇచ్చినట్టు భావించాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి జీవో 54 రద్దు చేస్తూ ప్రకటన విడుద చేయాలని కోరారు.

దివ్యాంగ క్రీడాకారుడికి ఆర్థిక సహాయం

బుచ్చెయ్యపేట, జూలై 14 : జమ్మకాశ్మీర్‌లో క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆర్.శివరామపురానికి చెందిన దివ్యాంగ క్రీడాకారుడు మొల్లి శ్యామల్‌కు విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ రూ.10 ఆర్థిక సహాయం అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్‌ను ఆదివారం టీడీపీ నాయకులు దేవర తాతాజీ అందజేశారు. చెముడు, మూగ అయిన శ్యామల్ క్రికెట్ క్రీడలో రాణించాడు. పేదవాడు కావడంతో రాష్ట్ర, జాతీయ స్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో పాల్గొనడానికి ఆర్థికంగా శ్యామల్ ఇబ్బంది ఎదుర్కొనేవాడు. ఈ విషయం తెలుసుకున్న గేదెల సత్యనారాయణ గత మూడేళ్లుగా పోటీల్లో పాల్గొనడానికి తన వంతు సహాయసహకారాలు అందిస్తున్నారు. ఈ నెల 17 నుంచి 22 వరకు జమ్ముకాశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో పాల్గొననున్న శ్యామల్‌కు రూ.10 వేలు అందజేశారు. తన కుమారుడుకి సత్యనారాయణ సహాయ, సహకారాలు అందచేయడంపై శ్యామల్ తండ్రి కొండబాబు, సోదరుడు కృపానంద్ కృతజ్ఞతలు తెలిపారు.



శ్యామల్‌కు చెక్ అందజేస్తున్న తాతాజీ తదితరులు

రెండో రోజూ ఇత్తడి సేకరణ

మాడుగుల, జూలై 14 : పురాతన కాలంలో నిర్మితమైన శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో గల ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగులు వేసేందుకు రెండోరోజైన ఆదివారం కూడా సేకరించారు. దీనికి భక్తులు, ప్రజల నుంచి స్పందన లభించింది. భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు మూకుమ్మడిగ ఇత్తడి తొడుగులతో ధ్వజస్తంభం పునఃనిర్మాణం చేసేందుకు ఇత్తడి సేకరణ చేపట్టగా తొలిరోజు 171 కిలోలు సేకరించారు. అలాగే ఆదివారం సాయంత్రం నాటికి 110 కిలోలు సేకరణ జరిగిందని గ్రామ పెద్దలు తెలిపారు. కాగా దీనికి సంబంధించి బయట గ్రామాలకు చెందిన భక్తులు కూడా ఇత్తడి విరాళం ఇవ్వవచ్చని గ్రామ పెద్దలు కోరారు.



ఇత్తడి సేకరిస్తున్న నిర్వాహకులు

ఎం.అలమండ పంట కాలువల్లో పూడిక తొలగింపు

దేవరాపల్లి, జూలై 14 : మండలంలోని ఎం.అలమండలో రైవాడ జలాశయం నుంచి ఆయకట్టుకు నీరందించే పంట కాలువలను ఉపాధి కూలీలు పూడిక తీసే పనులు చేపట్టారు. దీనివల్ల నీరు వృథా కాకుండా నేరుగా పంట భూములకు అందుతుందని అధికారులు తెలిపారు. ఈ పనులు పది గ్రూపులు వారు చేస్తున్నారన్నారు. గ్రామంలో చెరువులు లేకపోవడంతో ఈ కాలువలు పూడిక తీయడం వల్ల పూర్తి స్థాయిలో సాగు భూములకు నీరు అందుతుందన్నారు.



పంట కాలువలో పూడిక తీస్తున్న కూలీలు

జలాశయాలు కళకళ



మాకవరపాలెం : చెరువులో పుష్కలంగా చేరిన నీరు



నాతవరం : నిండుకుండలా ఉన్న దాలమ్మ చెరువు

మాకవరపాలెం, జూలై 14 : గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సాగునీటి చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే మండలంలో ఉన్న చిన్న పెద్ద కలిపి 180 చెరువులు నీటితో నిండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రిజర్వాయర్లు చినరాచపల్లి, పాపయ్యపాలెంలో కూడా వర్షపు నీరు చేరింది. అయితే ఇప్పటికే వరినారు మడులు పనులు దాదాపు పూర్తవడంతో ఈ ఏడాది అనుకున్న సమయంలోనే వరిపొలాలు దమ్ములు పూర్తవుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గొలుగొండలో..

గొలుగొండ : మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నీటితో నిండాయి. మండలంలోని పాతమల్లంపేటలో గల ధారగెడ్డ, రాళ్లగెడ్డ, ఎర్రవరం, పాకలపాడు, పాతమల్లంపేట, పప్పుశెట్టిపాలెం, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, జోగంపేట గ్రామాల్లో గల చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. ముందస్తుగా చెరువులు నిండడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సాగునీరుకు ఢోకా లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో వరినాట్లు సాగులో రైతులు బిజీగా వున్నారు.

నాతవరంలో..

నాతవరం : మండల కేంద్రం నాతవరంలో దాలమ్మచెరువు నిండుకుండలా దర్శనమిస్తోంది. గత మూడు నెలల నుంచి ఆశాజనకంగా వర్షాలు పడటంతో దాలమ్మ చెరువు పూర్తిస్థాయిలో నిండి నిండుకుండలా కళకళలాడుతుంది. అలాగే ఎర్రచెరువులో కూడా ఈ వర్షాలకు నీరు చేరింది. నాతవరం దాలమ్మ చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతులు జూలై నెల చివరి వారంలోనే ఎప్పుడు ఖరీఫ్‌కు చెరువులో ఉన్న నీటితో వరిపంట వేస్తూ వస్తున్నారు. నాతవరం మండలంలో ఆగస్టులో వరినాట్లు వేస్తుండగా ఈ దాలమ్మ చెరువు కింద మాత్రం ప్రతి ఏడాది ఒక్క నెల ముందుగానే చెరువు నీటితో వరినాట్లు వేస్తున్నారు. ఈ చెరువు కింద సుమారు 150 ఎకరాల వరకు వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం దాలమ్మ చెరువులో పుష్కలంగా నీరు చేరటంతో దాలమ్మ చెరువు ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గొలుగొండ : ఎర్రవరంలో నిండిన చెరువు

రాంకీ ఉపాధి హామీ హుళక్కేనా?

... 5వ పేజీ తరువాయి

కావస్తోంది. ప్రభుత్వాలు మారినా మత్స్యకారుల ఉపాధి మాత్రం ఎండమావిగానే మిగిలిపోయింది. దీనికితోడు ఇటీవల ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో భారీ ఎత్తున చేపలు మృతి చెందిన సంగతి తెలిసిందే. దీని కారణంగా మత్స్యకారులకు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. ఫార్మా వ్యర్థ జలాల కారణంగానే చేపలు మృత్యువాత పడ్డాయని మత్స్యకారులు గగ్గోలు పెట్టారు. ఇదే పరిస్థితి భవిష్యత్తులో కొనసాగుతుందేమోనన్న ఆందోళన మత్స్యకారుల్లో నెలకొంది. ఇప్పటికే ఫార్మా కాలుష్యంతో చేపల వేట కూడా అంతంత మాత్రంగానే సాగుతోంది. దీని వల్ల మత్స్యకారుల జీవనోపాధి అగమ్యగోచరంగా తయారైంది. వేట సాగక, ఉపాధి లేక కొంతమంది మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలస పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో మత్స్యకారులు ఉపాధి కోసం రాంకీ వద్ద ఆందోళన చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. రాంకీ ఇచ్చిన మాట ప్రకారం ఉపాధి కల్పించకపోతే తాడోపేడో తేల్చుకుంటామని మత్స్యకారులు చెబుతున్నారు. ఫార్మాసిటీ వల్ల తమ బతుకులు రోడ్డున పడ్డాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే కలుగజేసుకుని రాంకీ ఒప్పందం మేరకు మత్స్యకారులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మత్స్యకారులకు తీరని అన్యాయం

రాంకీ యాజమాన్యం మత్స్యకారులకు తీరని అన్యాయం చేసింది. ఫార్మా వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా సముద్రంలోకి విడిచిపెట్టడంతో మత్స్యసంపద నశించిపోతోంది. దీని వల్ల మత్స్యకారుల జీవనోపాధి అగమ్యగోచరంగా మారింది. మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తామని రాంకీ యాజమాన్యం ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలి. హామీ నెరవేర్చకపోతే రాంకీ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేపడతాం.ఈ విషయంపై ప్రభుత్వం జోక్యం చేసుకుని మత్స్యకారులకు ఉపాధి కల్పించేలారాంకీపై ఒత్తిడి తీసుకురావాలి.

- చింతకాయల సుజాత, ముత్యాలమ్మపాలెం సర్పంచ్

విశాఖ భూ దందాపై ప్రభుత్వం ఫోకస్!

... 5వ పేజీ తరువాయి

నివేదిక రూపొందించినట్టు తెలిసింది.

బే పార్కుతో ప్రారంభం

విశాఖలో బేపార్కు నుంచి భూ దందాల పంచాయితీ ప్రారంభమయింది. ఇది వైసీపీ ఐదేళ్ల పాలన ముగిసేవరకు కొనసాగింది. కార్తీకవనం చేజిక్కించుకుని రాడిసిన్ బ్లూ హోటల్ నిర్మాణం, భీమిలిలో భూ యజమానులను బెదిరించి భారీఎత్తున భూములు కారుచౌకగా లాక్కోవడం, దసపల్లా భూములను 22(ఎ) నుంచి తొలగించి ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తెకు చెందిన కంపెనీతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకోవడం వరకు కొనసాగింది. ఈ వ్యవహారంలో అప్పటి ప్రభుత్వంలో కీలక పెద్దల పాత్ర ఉందనేది బహిరంగ రహస్యం. రుషికొండ ప్రాంతంలోని పనోరమ హిల్స్ పరిసరాల్లో పలువురి నుంచి బలవంతంగా ప్లాట్లు తీసుకుని భారీ కట్టడాలు నిర్మిస్తున్నారు. మధురవాడ ఐటీ హిల్స్ సమీపంలో ఎన్‌సీసీకి చెందిన 100 ఎకరాల భూమిని బెదిరింపులకు పాల్పడి టేకోవర్ చేసుకుని, గత ప్రభుత్వంలో పనిచేసిన మంత్రి తమ్ముడికి అప్పగించారు. రుషికొండ తారకరామా లేఅవుట్‌లో రేడియంట్ కంపెనీకి చెందిన 50 ఎకరాలను కూడా లాక్కున్నారు. నగరంలో పలుచోట్ల అడ్డగోలుగా టీడీఆర్‌లు కొట్టేశారు.

అసైన్డ్ భూములపైనా కన్ను

ఇదిలావుండగా గ్రామీణ మండలాలైన ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తిలో అసైన్డ్ భూములను చేజిక్కించుకునేందుకు జీవో 596 జీవో తీసుకువచ్చారు. గత ప్రభుత్వంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కేఎస్ జవహర్‌రెడ్డి బినామీలు త్రిలోక్‌తో పాటు మరికొందరు వందల ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు పొంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇలా సుమారు 2,500 ఎకరాలకు ఒప్పందాలు చేసుకుని, అడ్వాన్స్‌లు ఇచ్చి 500 నుంచి 600 ఎకరాలను రిజిస్టర్ చేసుకున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పరిసరాల్లోని భీమిలి మండలంలో పలువురు రైతులను బెదిరించి భూములు కొట్టేశారు.

ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి దృష్టి సారించడంతో విశాఖలో భూదందాలపై విశాఖ ఫైల్స్ పేరిట నివేదిక విడుదల చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రకటించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే భీమిలి నియోజకవర్గంలో పలు ఆక్రమణలు, కబ్జాలపై ఆయన కొంత సమాచారం సేకరించారు.

పెద్దేరుకు ఎంత కష్టం!

... 5వ పేజీ తరువాయి

పడడంతో రెండు మండలాల్లో సుమారు తొమ్మిది వేల ఎకరాలకుగాను వెయ్యి ఎకరాలకు మాత్రమే నీరు అందుతున్నది. కాలువల ఆధునీకీకరణ పనుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపడం, గత ప్రభుత్వం బుట్టదాఖలు చేయడం పరిపాటిగా మారింది. ఐదేళ్ల క్రితం రూ.32 కోట్లుగా వున్న అంచనా వ్యయం, ప్రస్తుతం రూ.85 కోట్లకు పెరిగింది.

పెద్దేరు రిజర్వాయర్ కుడి కాలువ కింద బుచ్చెయ్యపేట మండలంలో ఎర్రవాయి ప్రాంతంగా పిలిచే గున్నెంపూడి, పెదమదీన, కొండపాలెం, కేపీ అగ్రహారం, ఐతంపూడి, బుచ్చెయ్యపేట, పి.భీమవరం, కందిపూడి, దిబ్బిడి, కొండెంపూడి గ్రామాలకు చెందిన 4,500 ఎకరాలు, రావికమతం మండలంలో కవ్వగుంట నుంచి పిల్లవానిపాలెం వరకు 17 గ్రామాల పరిధిలో 4,513 ఎకరాల ఆయకట్టు వుంది. కాలువ నుంచి చెరువుల్లోకి నీటిని మళ్లిస్తే ఆయకట్టు విస్తీర్ణం పెరగడంతోపాటు రెండో పంట కూడా పండించుకోవచ్చని రైతులు ఆశించారు. అయితే కాలువ తవ్వకం సమయంలో ఇంజనీరింగ్ అధికారుల ప్రణాళికా లోపం, వైఫల్యంతో అన్నదాతల కలలు కల్లలయ్యాయి. ఎగువన వున్న రావికమతం మండలంలో కన్నా బుచ్చెయ్యపేట మండలంలో కాలువ ఎత్తుగా వుండడంతో నీరు సరిగా ప్రవహించక లోతట్టు ప్రాంతాల్లో కాలువ గట్లకు గండ్లు పడడం మొదలైంది. ఇంజనీరింగ్ అధికారులు పలుమార్లు పనులు చేయించినా ఫలితం లేకపోయింది. రిజర్వాయర్‌లో ఏడాది పొడవునా నీరు పుష్కలంగా వుంటున్నప్పటికీ కాలువ అధ్వానంగా వుండడం, నీటిని విడుదల చేస్తే కాలువ గట్లకు గండ్లు పడుతుండడంతో ఆయకట్టుకు నీటి సరఫరాను నిలిపేశారు. మొత్తం మీద రావికమతం మండలంలో కవ్వగుంట, బుడ్డిబంద, చినపాచిల, కేబీపీ అగ్రహారం గ్రామాల పరిధిలో వెయ్యి ఎకరాలకు మాత్రమే అరకొరగా సాగునీరు అందుతున్నది. ఇదిలావుండగా నీరు సాఫీగా ప్రవహించేలా కాలువ డిజైన్ మార్చడంతోపాటు సిమెంట్ లైనింగ్ చేయాల్సిన అవసరం వుందని గుర్తించిన ఇంజనీరింగ్ అధికారులు ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపడం, నిధులు మంజూరు కాకపోవడం ఆనవాయితీగా మారింది. కాగా 2023 మార్చిలో రిజర్వాయర్ అభివృద్ధికి రూ.84.4 కోట్ల నిధులు మంజూరైనట్టు అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చేసిన ప్రకటనతో రైతుల్లో ఆశలు చిగురించాయి. మంజూరైన నిధులతో రిజర్వాయర్ అభివృద్ధితో పాటు రూ.40 కోట్లతో ఆర్ఎంసీ, ఎల్ఎంసీ చానల్స్ సీసీ కాంక్రీట్‌తో లైనింగ్ పనులు చేపడతామని బూడి చేసిన ప్రకటన మేరకు ధీమా పడిన పది గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు వేలాది ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టారు. అయితే ఆధునికీకరణ పనులు ప్రకటనకే పరిమితమయ్యాయి. గత ఖరీఫ్‌లో ఏర్పడ్డ వర్షాభావానికి పంటలు దెబ్బతిన్నాయి. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు.

4ఎల్ కాలువ పనులూ అంతే!

పెద్దేరు ఎడమ ప్రధాన కాలువ పరిధిలోని 4ఎల్ మైనర్ కాలువ కింద మాడుగుల మండలం ఎల్.గంగవరం, పొన్నవోలు, ఓంప్రుపీధి, ఎల్.కృష్ణాపురం, గడబవీధి, పాత గవరవరం, కాకంకోట, కోండ్లపాడు గిరిజన గ్రామాల్లో 847 ఎకరాల ఆయకట్టు వుంది. కానీ కాలువలో తుప్పలు పెరిగిపోయి, పూడిక పేరుకుపోయింది. కొన్నిచోట్ల గట్లు బలహీనంగా వున్నాయి. దీంతో ఆయకట్టుకు నీరు సరిగా అందడంలేదు.

గత పాలకుల హామీలతో మోసపోయాం



పెద్దేరును ఆధునికీకరిస్తామని గత వైసీపీ పాలకులు ఇచ్చిన హామీలకు మోసపోయాం. రిజర్వాయర్ కుడి కాలువను సీసీ కాంక్రీట్‌తో లైనింగ్ చేస్తామని వైసీపీ పాలకులు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి.గత ఏడాది అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నిధులు మంజూరయ్యాయని చేసిన ప్రకటన ఎన్నికల స్టంట్‌గా గుర్తించలేకపోయాం. కాలువ ఆధునికీకరణ జరుగుతుందన్న ధీమాతో గత ఖరీఫ్‌లో సాగు చేపట్టాం. అయితే వర్షాభావానికి వేలాది మంది రైతులు పంటలు కోల్పోయారు. కూటమి ప్రభుత్వం కుడి కాలువను ఆధునికీకరించి, రైతులను ఆదుకోవాలి.

- తుమ్మలపూడి నాగరాజు, రైతు, గున్నెంపూడి

రహదారులు ఇలా.. వెళ్లేదెలా?

... 5వ పేజీ తరువాయి

కలిపే ఈ రహదారి ఐదేళ్లుగా గోతులతో దర్శనమిస్తోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో కనీసం మరమ్మతులు చేపట్టలేదు.వర్షాకాలంలో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో రెండేళ్ల క్రితం జనసేన నాయకులు సొంత ఖర్చులతో గోతులను తాత్కాలికంగా పూడ్చారు. అలాగే గత ఏడాది జనసేన, టీడీపీ నాయకులు క్రషర్ బూడిదతో పూడ్చారు. అయితే వర్షాలకు మళ్లీ గోతులు పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులు ఈ మార్గంలో ప్రయాణించేటప్పుడు నరకయాతన పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో తమ కష్టాలు తీరతాయని పలు గ్రామాల ప్రజలు, వాహనచోదకులు ఆశాభావంతో ఉన్నారు.

గొలుగొండ మండలంలో...

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు గోతులతో అధ్వానంగా ఉన్నాయి. ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో వర్షమొస్తే ఆ గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా పాతకృష్ణాదేవిపేట, పల్లావూరు, రామచంద్రపురం, కొంగసింగి, ఏఎల్‌పురం, లింగంపేట తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు దారుణంగా ఉంది. ఈమార్గంలో ప్రయాణించే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రహదారులకు కనీసం మరమ్మతులు చేయించకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.